www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 04 | నవంబర్ | 2025

పేజీలు : 8


## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల దారుణ హత్య



ముత్తగూడెంలో..



కాకరవాయిలో..

2 లో

-ముత్తగూడెంలో వియ్యపురాలిని చంపిన వియ్యంకుడు
-కాకరవాయిలో మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిని కడతేర్చిన తనయుడు

# ఇద్దరికి హరికృష్ణే ఆధారమట..!



-ఎవరి వాదన వారిదే
-మణుగూరులో వేడి తగ్గని రాజకీయం
-ఫిరాయింపులతోనే తలనొప్పి







**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మణుగూరు కార్యాలయ రాజకీయం ఇప్పుడు హరికృష్ణ చుట్టూ తిరుగుతుంది. హరికృష్ణ వద్దే తాము కొనుగోలు చేశామని కాంగ్రెస్‌కు చెందిన ప్రస్తుత శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు వాదిస్తుండగా మేము ఆ హరికృష్ణ దగ్గరే కొనుగోలు చేశామని

మిగతా 2లో..

## అవకాశాలను అందిపుచ్చుకోవాలి





- విద్యార్థులు చదువులో రాణించాలి
- మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని చదువులో రాణించి ఉజ్వల భవిష్యత్‌ను అందుకోవాలని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి బసవతారక కాలనీలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సుమారు 150 మంది డే స్కాలర్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎంఎల్‌ఏ కూనంనేని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేసిన ఫౌండేషన్ చైర్మన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయోజకులు కావాలని కోరుకొంటారని అన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా శ్రద్ధగా చదుకొని బంగారు భవిష్యత్‌ను సాధించి వారి నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. దీనితో కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. ఆకలి సూచికలో ప్రపంచంలో మనదేశం 161వ, స్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించినపుడే వారు చదువులో రాణించటానికి అవకాశం ఉందన్నారు. మీకోసం, మీ చదువు కోసం, మీ బంగారు భవిష్యత్ కోసం మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేసిన వారి కోసం మీరు చదువులో రాణించి, అత్యుత్తమ ఫలితాలు సాధించి వారికి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని సూచించారు. తెలివి తేటలు ఏ ఒక్కరి

మిగతా 2లో..

## సారూ.. ఇదేం పని..!





-యూనియన్ల పేరుతో గ్రూపుల సృష్టి
-అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు

**ప్రజాపక్షం/ వైరా :** తన పని తాను చేసుకుంటూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాల్సిన అధికారి వర్గ రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారారు. ఎక్కడ లేనివిధంగా మున్సిపాలిటీలో 14వ నెంబర్ జీవో అంటూ ఒక యూనియన్‌ను సృష్టించి మిగిలిన కార్మికులను వేధించడంతో పాటు కార్మికుల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ ప్రజలు పద్దతి మార్చుకోండి మీ పనిలో మీరు ఉండండి పాలనలో వర్గ విబేధాలు మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రభావం చూపుతాయని చెప్పినా అధికారి తన రూటే సపరేటు అంటూ వ్యవహరిస్తున్నారు. గతంలో విధుల నుంచి తొలగించిన ఇద్దరు అధికారులను అడ్డుపెట్టుకుని కార్మిక సంఘాల నేతలు తన చేతిలో ఉంటే తాను ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందని భావిస్తున్నాడనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ అధికారి గతంలో ఖమ్మంలో పని

మిగతా 2లో..

# ఇద్దరికి 'హరికృష్ణే' ఆధారమట..!

**(మొదటిపేజీ తరువాయి)**
బిఆర్ఎస్ నాయకుడు, మాజీ శాసన సభ్యుడు కాంతారావు చెబుతున్నారు. మొత్తంగా ఇప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎవరి హరికృష్ణ అనే చర్చ మొదలైంది. మణుగూరులో ఆదివారం కార్యాలయ వివాదంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడిన విషయం విధితమే. ప్రస్తుత బిఆర్ఎస్ కార్యాలయంగా ఉన్న దానిని కాంగ్రెస్‌కు చెందిన వందలాది మంది అక్రమించి కార్యాలయంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే కాకుండా బిఆర్ఎస్‌కు చెందిన ఫర్నీచర్‌ను సైతం తగులబెట్టారు. ఈ విషయమై సోమవారం ప్రస్తుత శాసనసభ్యుడు, మాజీ శాసనసభ్యుడు కూడా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి తమ వద్ద గల ఆధారాలను మీడియాకు చూపారు. ఇద్దరు చందా హరికృష్ణ వద్దే తాము కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. కొర్సా సమ్మయ్య అనే వ్యక్తి వద్ద హరికృష్ణ కొనుగోలు చేశాడని చందా హరికృష్ణ వద్ద నుంచి 2024లో తాము కొనుగోలు చేశామని రేగా కాంతారావు మీడియాకు తెలిపారు. ఇదే విషయమై పాయం వెంకటేశ్వర్లు కూడా తాము 2023లో చందా హరికృష్ణ దగ్గర నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. ఇద్దరు ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను చూపడం విశేషం. అసలు ఎవరి హరికృష్ణ అంటే రేగా కాంతారావుకు సమీప బంధువు. వరుసకు బావమరిది. 2018 నుంచి 2023 మధ్య రేగా కాంతారావు శాసనసభ్యునిగా పని చేసినప్పుడు వ్యక్తిగత సహాయకునిగా ఉన్నారు. 2023 ఎన్నికలు ముగిసి కాంతారావు ఓటమి తర్వాత హరికృష్ణను దూరం పెట్టారు. ఆ తర్వాత హరికృష్ణ మణుగూరులో కనిపించడం లేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా రెండు రాజకీయ పార్టీలు హరికృష్ణ చుట్టూ తిరుగుతున్నాయి. మున్సిపాలిటీలో ఇప్పటికీ 81200/2 నెంబర్ గల ఈ పార్టీ కార్యాలయం హరికృష్ణ పేరు మీద ఉండటం గమనార్హం. 2023లో కొనుగోలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు మార్చుకోలేదు. అదే సమయంలో బిఆర్ఎస్ పార్టీ కూడా ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. కొనుగోలు చేసినప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా ఐదారేండ్ల పాటు ఇరువురు కూడా ఎందుకు తమ పేరుపై మార్చుకోలేదన్నది ఇప్పుడు మదిని తొలుస్తున్న ప్రశ్న. ఇద్దరు గౌరవ స్థానాల్లో ఉన్నవారే. ఇందులో ఎవరిది పొరపాటైనా తగిన మూల్యం చెల్లించడంతో పాటు ప్రజల్లో అబాసుపాలు కాక తప్పదు.

**అసలు కారణం ఫిరాయింపులే...**
ఈ పెద్ద వివాదానికి కారణం పార్టీ ఫిరాయింపులే. ఇక్కడ గతంలో ప్రాతినిథ్యం వహించిన రేగా కాంతారావు కానీ ప్రస్తుతం ప్రాతినిథ్యం వహిస్తున్న పాయం వెంకటేశ్వర్లు ఫిరాయింపుదారుడే. రేగా కాంతారావు 2009లో కాంగ్రెస్ నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2014లో ఓటమి చెందారు. 2018లో మరోసారి గెలిచిన కాంతారావు 2019లో బిఆర్ఎస్‌లో చేరారు. తాను పార్టీ మారడమే కాకుండా అప్పటి వరకు కాంగ్రెస్ కార్యాలయంగా ఉన్న భవనాన్ని బిఆర్ఎస్ భవనంగా మార్చివేశారు. విపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు చెందిన రాష్ట్ర స్థాయి నేతలు దీనిపై ఆందోళనలు చేయడం మున్సిపాలిటీలో ఫిర్యాదు చేయడం కూడా జరిగింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక రెండేళ్లకు దానిపైన దృష్టిసారించింది కాంగ్రెస్. పాయం వెంకటేశ్వర్లు కూడా ఇప్పటికి మూడు పార్టీలను మార్చారు. తొలుత సిపిఐ రాజకీయాలతో ఆరంగేట్రం చేసిన పాయం వెంకటేశ్వర్లు 2004లో అప్పటి బూర్గంపాడు నుంచి సిపిఐ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికయ్యారు. 2013లో అప్పటి వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరి 2014లో జరిగిన ఎన్నికల్లో వైసిపి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 2014 తర్వాత వైసిపి నుంచి బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పాయం కాంగ్రెస్ అభ్యర్థి రేగా కాంతారావు చేతిలో ఓటమి చెందారు. 2023 జూన్ మాసంలో మరోసారి పాయం పార్టీ మారారు. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈసారి విభిన్న పద్ధతుల్లో బిఆర్ఎస్ నుంచి కాంతారావు, కాంగ్రెస్ నుంచి పాయం పోటీ చేయగా పాయం గెలిచారు. ఒక రకంగా ఇద్దరు ఫిరాయింపుదారుల మధ్య పార్టీ కార్యాలయ వివాదం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హరికృష్ణ వెలుగులోకి రావడం అసలు డాక్యుమెంట్ ఏదో తేల్చాల్సిన బాధ్యత ఇప్పుడు అధికారులపై పడింది. మణుగూరు అంటేనే ఇసుక అక్రమ వ్యాపారాలకు కేంద్రంగా చెప్పుకుంటున్న నేపథ్యంలో హరికృష్ణకు ఇసుక ర్యాంపు ఇస్తామని డాక్యుమెంట్ రాయించుకున్నారన్న ఆరోపణలు రావడం కొసమెరుపు.

# సారూ.. ఇదేం పని..!

**(మొదటిపేజీ తరువాయి)** చేసినప్పుడు కూడా ఇటువంటి ఆరోపణలే ఎదుర్కొనడం గమనార్హం. బదిలీపై వైరాకు వచ్చిన తన తీరు మాత్రం మార్చుకోవడం లేదు. గతం లో అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఈ అధికారి తిరిగి తన అవినీతి సామ్రాజ్యాన్ని వైరాలో కూడా విస్తరింపజేయాలని మరో వ్యక్తిని కలుపుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కార్మికులను ఐక్యంగా నడిపి మున్సిపాలిటీలో పారిశుధ్యం ఇతర ప్రజా ఉపయోగ పనులను సక్రమ పద్ధతిలో నెరవేర్చేందుకు దోహదపడాల్సిన ఈ అధికారి కార్మిక నాయకుని అవతారం ఎత్తి యూనియన్ల ఏర్పాటులో మునిగి తేలుతున్నాడు. నిత్యం తన వర్గానికి చెందిన కార్మికులతో విధులు పక్కనపెట్టి సమావేశాలు నిర్వహించడం చేస్తున్నాడు. గతంలో పనిచేసిన చోట కార్మిక సంఘాలు నిరసనలు తెలియజేసిన సారు మారలేదు. ఇక యూ నియన్ల ఏర్పాటులో మునిగి తేలిన సదరు సారు ఆఫీసుకు ఎప్పుడు వస్తారో ఎప్పుడు బయటకు వెళ్తారో ఉన్న ఎవరితో సమావేశం లో ఉం టారో తెలియని పరిస్థితి. అధికారి తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, విధులు సక్రమంగా నిర్వర్తించకుండా ఇతరత్రా పనులు, అవినీతి వ్యవహారాలపై దృ ష్టి సారించిన అధికారిపై తగు చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘా ల నేతలు కోరుతున్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల పేరుతో ఇద్దరు వ్యక్తులను ఏర్పా టు చేసుకుని తప్పుడు మార్గంలో ఫీజులు వసూలు చేశారన్న ఆరోపణ లు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కమిషనర్ ఆ ఇద్దరు వ్యక్తులను విధుల నుంచి తప్పించిన సదరు అధికారిపై చర్యలు తీసుకోలేదు. ఈ వి షయమై సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు మాట్లాడుతూ ఇదివరికే అధికారి తీరుపై ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కార్మికుల మధ్య చిచ్చుపెట్టడంతో పాటు వైరా మున్సిపాలిటీని వసూళ్ల కేంద్రంగా మారుస్తున్న ఈ అధికారిపై తక్షణ చర్యలు తీసుకోని నేపథ్యంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మరో ఆరు నెలల పాటు
# కాల్పుల విరమణ

### -మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటన


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
తెలంగాణ రాష్ట్ర కమిటీ

కాల్పుల విరమణను మరో 6 నెలల పాటు కొనసాగిస్తున్నాము.

జగన్
అధికార ప్రతినిధి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలో మరో ఆరు నెలల పాటు కాల్పుల విరమణను పాటిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ తెలిపారు. ఈ మేరకు ఒక లేఖ విడుదల చేశారు. గత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక వర్గాలు శాంతి కోసం ఉద్యమాలు చేశారని వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఆరు నెలల పాటు కాల్పుల విరమణ ప్రకటించామని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఆరు మాసాల కాలంలో తమ వైపు నుంచి శాంతియుత వాతావరణం కొనసాగించేలా కృషి చేశామని జగన్ లేఖలో పేర్కొన్నారు. దీనినే కొనసాగిస్తూ మరో ఆరు నెలల పాటు కాల్పులు విరమించి శాంతియుత వాతావరణానికి సహకరిస్తామని ఆయన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టాలని ప్రయత్నాలు చేస్తుందని ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని సామాజిక వర్గాలు, సంఘాలు, విద్యార్థి, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అడ్డుకోవాలని జగన్ లేఖలో తెలిపారు.

# పోస్టుమార్టం మార్చురీ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/గుండాల :** మండల కేంద్రంలో పోస్టుమార్టం మార్చురిని ఏర్పాటు చేయాలని నవచైతన్య యువజన సంఘం అధ్యక్షులు ఆజాద్ సోమవారం మండల కేంద్రానికి విచ్చేసిన డిఎంఅండ్‌హెచ్‌ఒ విజయ లక్ష్మి కి వినతి పత్రాన్ని అందించారు. అందు సానుకూలంగా స్పందించినట్లు ఆజా ద్ తెలిపారు. మండల కేంద్రంలో పోస్టుమార్టం మార్చురిలేక ప్రజలు నాన ఇబ్బందులకు గురౌతున్న పరిస్థితి ఇక్కడ నెలకొందని వివరించారు. మండల కేంద్రానికి 60కిమి. దూరంలో ఉన్న ఇల్లందు పట్టనానికి తీసుకెల్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. మారుమూల మండల కేంద్రంలో డయాలసిస్, స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని అలాగే శెట్టుపల్లి, సాయనపల్లి, ముత్తాపురం సబ్‌సెంటర్లలో కరెంట్, టాయిలెట్ సౌకర్యం కల్పించాలని , పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని యాస్పేరేషన్ బ్లాక్ ప్రథినిదులకు వివరించారు. కార్యక్రమంలో సంతోష్ , వినయ్, ఉదయ్, సతీష్ పాల్గొన్నారు.

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల దారుణ హత్య

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో వియ్యపురాలిని వియ్యంకుడు కుటుంబం దారుణంగా హత్య చేయగా మరో ఘటనలో తల్లి తన పెన్షన్ డబ్బులను మద్యం తాగేందుకు ఇవ్వలేదని కన్నతల్లిని కడతేర్చాడు. ఈ రెండు ఘటనలతో పాటు కొద్ది రోజుల క్రితం తల్లాడ మండలంలో జరిగిన ఘటన కూడా దారుణమే. పూర్తి వివరాల్లోకి వెళితే... ఖమ్మం రూరల్ మండలంలోని ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంలో ఓ మహిళను సమీప బంధువులు కత్తితో పొడిచి హతమార్చారు. వివరాల్లోకి వెళితే... ముత్తగూడెంకు చెందిన మేక పోతుల వెంకన్న కుమార్తె అఖిలను అదే గ్రామానికి చెందిన మహేష్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. ఇద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీ నిర్వహించారు. సోమవారం అఖిల తండ్రి వెంకన్న, కుమారుడు మనోజ్ లు వెంకన్న బావమరిది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దేవుని సంకిసకు చెందిన ఎల్ది వెంకన్న లు అఖిలను తీసుకుని మహేష్ ఇంటికి వెళ్లారు. అఖిలను మీ ఇంట్లో వదిలి వెళ్తామని ఇక ముందు మంచిగా జీవించండి అని అఖిల తండ్రి వెంకన్న కోరడంతో మహేష్ ససేమీరా అన్నాడు. దీనితో ఇరు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. వెంటనే ఇంటికి వెళ్లిన వెంకన్న ఆయన కుమారుడు మనోజ్ బావమరిది వెంకన్నలు కర్రలు, కత్తులతో వచ్చి మహేష్ ఇంటిపై దాడి చేశారు. మహేష్‌ను తీవ్రంగా కొట్టి అతనిపై కత్తులతో దాడి చేశాడు. ఇది గమనించిన మహేష్ తల్లి నాగమణి అడ్డురాగా ఆమెను కత్తితో పొడిచారు. తీవ్ర గాయాల పాలైన నాగమణి (48) అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్ర గాయాల పాలైన మహేష్‌ను ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఏసిపి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో కన్నతల్లిని కుమారుడు కడతేర్చిన ఘటన చోటు చేసుకుంది. మందులబూబ (50) కుమారుడు మధు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి వచ్చిన మధు తల్లిని మద్యం కోసం డబ్బులు అడిగాడు. కాయకష్టం చేసుకుని జీవించే బూబ డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించింది. దీనితో తల్లితో ఘర్షణ పడి గొడ్డలితో తల్లిపై దాడి చేశాడు. ఈ ఘటనలో బూబ అక్కడికక్కేడ మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లాడ మండలంలో కన్న తండ్రి కొడుకును హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తల్లాడ మండల పరిధిలోని కరకగూడెం గ్రామానికి ఆదూరి రాజేష్ కుమారుడు నాగరాజు మద్యానికి బానిసై జులైగా తిరుగుతుండేవాడు. పలుమార్లు తండ్రి రాజేష్ కుమారుడు నాగరాజు మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో మద్యం తాగుదామని తండ్రి రాజేష్ కొడుకును కోరాడు. మద్యంలో విషం కలిపి కొడుకు చేత తాగించాడు. మద్యం తాగిన నాగరాజును ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూడగా తల్లాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**(మొదటిపేజీ తరువాయి)**
సొత్తు కాదన్నారు. ఇష్టపడుతూ, కష్టపడుతూ చదవాలని అపుడే మెరుగైన ఫలితాలను సాధిస్తారని అన్నారు. అపుడే వారి సేవకు సార్థకత ఉంటుందన్నారు. ప్రవేటు విద్యా సంస్థలలో చదితే వారిని చూసి మనల్ని మనమే తక్కువగా ఊహించుకోవద్దన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో పలు పరీక్షల్లో విజయాలు సాధించిన అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. తెలివి తేటలు ఏ ఒక్కరి సొత్తుకాదని ఇష్టపడుతూ కష్టపడి చదవాలని అపుడే మనం అనుకున్న ఫలితం సాధిస్తామని అన్నారు. బాలికలు సైతం బాలురులకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. మహిళల క్రికెట్‌లో మన జట్టు 1978 నుండి ప్రపంచ్ కప్ గెలవాలని ప్రయత్నిస్తూ నేడు విజయం సాధించి, గెలిచి ప్రపంచ కప్‌ను అందించిన తీరు పట్టుదలకు మారు పేరుగా నిలుస్తుందన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించటానికి ఇది చక్కని ఉదాహరణగా చెపుతూ విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు కళాశాలలో వందకు వందశాతం రిజల్ట్ సాధించాలని ఆకాంక్షించారు. చదువులో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యే దృష్టి సారించాలన్నారు. వారికి అర్థమయ్యే రీతిలో విద్యను అందించి ముందుకు తీసుకుపోవాలన్నారు. 400 మంది విద్యార్థులున్న కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో 600 వరకు సంఖ్యను, అలాగే హాజరు శాతం పెంచాలన్నారు. దానికి ఉపాధ్యాయ స్టాఫ్ కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తారన్నారు. కళాశాలలో మౌళిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా మాట్లాడుతూ...మీ కోసం, మీ చదువు కోసం కష్టపడుతూ మిమ్ములను చదివించి ప్రయోజకులుగా చూడాలని మీ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. చదువులో రాణించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ సురేష్‌రెడ్డి, జిజెఎల్‌ఏ జిల్లా అధ్యక్షులు ఖుర్షీద్, సిపిఓ సంజీవరావు, కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, లెక్చరర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన జిఎం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నూతనంగా ఏర్పాటు చేసిన సత్తుపల్లి సింగరేణి ఏరియాకు ఎనికైనా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం అందజేశారు. నూతనంగా ఏర్పాటైన ఏరియాకు తమ సహకారం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి స్పందిస్తూ తమ సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం జి.ఎం శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలుపుతూ సింగరేణి ప్రభావిత ప్రజలకు సంస్థ సహాయ సహకారాలు అందించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జి.ఎంతో పాటు జే.వి.ఆర్ ఓ సి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద, డి.వైస్.ఎస్.సి రవికుమార్,సంక్షేమ అధికారి దేవదాసు ఉన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొణిజర్ల మండలానికి చెందిన నారీ మహిళా సేవా సంఘం సభ్యులు తమకు స్వయం ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామానికి చెందిన వాకర్స్ సాగర్ కాలువ పక్కన ఉన్న రహదారి వద్ద ప్రజలు బహిరంగ మల విసర్జన చేస్తున్నారని దీనిని నివారించి అక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. తిరుమలాయపాలెం జింకలగూడెం గ్రామానికి చెందిన ఇమామ్‌సాబ్ 1979లో ప్రభుత్వం సర్వే నెం. 262లో రెండు ఎకరాల 20 కుంటల అసైన్డ్ భూమి ఇచ్చారని నేటి వరకు చూపించలేదని తనకు న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు. సింగరేణి మండలానికి చెందిన కె. సురేష్ తమ ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. పెనుబల్లి బిసి కాలనీకి చెందిన కె. కళావతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 1999 నుంచి స్వీపర్‌గా పని చేస్తున్నానని తనకు మే నెలలో రూ. 9,500 వేతనం వచ్చిందని జూన్ నెల నుంచి తనతో పని చేయించుకుని మూడు వేలు ఇస్తామని పంచాయతీ కార్యదర్శి బెదిరిస్తున్నాడని తనకు పూర్తి జీతం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్లు సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్విరామ సేవలకు కృతజ్ఞతలు

**-పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన సిబ్బందికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్ నెలలో పదవి విరమణ పొందిన ఎనిమిది మంది సిబ్బంది కోసం కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ పదవి విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమన్నారు. మనకు గుర్తింపు ఉద్యోగం నుంచే లభిస్తుందన్నారు. సుమారు 30 నుంచి 40 ఏళ్ల పాటు ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయమన్నారు. దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలందించి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పదవి విరమణ పొందిన సిబ్బందిని సన్మానించడం మన బాధ్యత భావిస్తున్నామన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో సిహెచ్‌వోగా పని చేస్తున్న బి. అన్నమ్మ, వైరా ఎంపిహెచ్ ఈవోగా పని చేస్తున్న జే. జాన్సన్, కుక్‌గా పనిచేసిన జి. ఉమాదేవి, ప్లానింగ్ శాఖలో ఎస్‌వో గోపాల్, జెడ్పి ఖమ్మం కార్యాలయ సబార్డినేట్ బుచ్చయ్య, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ అభిమాన్యు తదితరులను అదనపు కలెక్టర్లు శాలువతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పదవి విరమణ పొందిన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సామినేని రామారావుది రాజకీయ హత్య



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో సంచలనం కలిగించిన సిపిఎం పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు హత్య విషయంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సమాధానం చెప్పాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రామిశెట్టి పుల్లయ్య భవనం నుండి రింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా బతుకమ్మ ఊరేగింపులో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఘర్షణ పడ్డారని సామినేని రామారావు భార్య స్వరాజ్యం తెలిపారని, హత్య కారకులైన హంతకులను స్థానిక ప్రజలు గుర్తించారని, పోలీసులు వారిని పట్టుకోవడంలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గుండాలు పథకం ప్రకారం అతి కిరాతంగా హత్య చేసి నాలుగు రోజులు దాటిన పోలీస్ అధికారులు నిందితులను అరెస్టు చేయకపోవటంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు హత్య చేసిన వారిని వదిలేసి బాధిత కుటుంబంపై విచారణ చేపట్టడం సరైన పద్దతి కాదన్నారు. ఈ హత్యను ప్రజాస్వామ్యవాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లమోతు హన్మంతరావు, షేక్. నాగుల్‌మీరా, ఆంగోతు వెంకటేశ్వర్లు, మందడపు ప్రభాకర్, గౌర్రాజు రాములు, లగడపాటి అప్పారావు, శ్రీనివాసరావు, కన్నెబోయిన శ్రీను, తాళ్ళూరి వెంకటనారాయణ, చిత్తూరు కిషోర్, కొండేపాటి శివయ్య, దివ్వెల వీరాంజనేయులు, కుర్ర వెంకటరామయ్య, కోటి సుబ్బారెడ్డి, నక్క పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** పిఎసిఎస్ రాజుపాలెం సంఘం పరిధిలోని పిపిసి వెంకటాపురం, నర్సింహాపురం, ఎర్రుపాలెం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ మన్నే ఉషాశారద, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మండల వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షలు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సంఘ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులు 17శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలని, రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి గ్రేడ్ ఎ సన్నరకంకు రూ.2389, దొడ్డురకం రూ.2369 మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులందరూ ఈ సీజన్ నుంచి పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవాలని, పత్తి పంట వేసుకున్న రైతులందరూ మీ సంబంధిత ఎఇఓలు దగ్గరికి వెళ్లి పంట నమోదు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సాయిశివ, ఎంఇఓలు ఎడుకొండలు, కె.వంశీకృష్ణ ఎర్రుపాలెం మండల కెమిస్టుఅండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్షులు కర్నాటి సుధాకర్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, దోమందుల సామేలు, బూసుపల్లి వెంకటరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ కంచర్ల వెంకట నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఉపకార వేతనాల దరఖాస్తులు సమర్పించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలకు సంబంధించి 2017 నుండి 2024-25 సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించి ఆయా ప్రిన్సిపాళ్లు దరఖాస్తులను ఈనెల 20లోగా సమర్పించాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యూషన్ ఫీజులకు సంబంధించి చాలా దరఖాస్తులు నో ఫీజు అని ఈ పాస్ వెబ్‌సైట్‌లో చూపించడం జరుగుతుందని, కళాశాల యాజమాన్యం, సంబంధిత శాఖల సోషల్ వెల్ఫేర్‌లో కానీ లేదా పిఎంయు సెంటర్ ను సంప్రదించి సంబంధిత ఫీ స్ట్రక్చర్‌ను ఈపాస్ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఫీజు స్ట్రక్చర్‌ను అప్‌డేట్ చేసుకుని కళాశాలలకు ట్యూషన్ ఫీజు రాకపోతే సంబంధిత కళాశాలల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అట్టి వారిపై శాఖపరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారాలను ఈనెల 20లోగా కలెక్టరేట్‌లోని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

# శతాబ్ది ఉత్సవాల ముగింపుసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/బోనకల్:** డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బోనకల్ మండలానికి ప్రత్యేక స్థానముందని అన్నారు. గోవిందాపురం(ఎల్), బ్రాహ్మణపల్లి, చిరునోముల, ముష్టికుంట్ల తదితర గ్రామాలలో ఎందరో కమ్యూనిస్టుల త్యాగాలతో సాయుధ పోరాటాన్ని నడింపించరన్నారు. అటువంటి ప్రాంతాల్లో ఒకటైన ముష్టికుంట్ల నాటి నేటి వరకు కమ్యూనిస్టులను అదరిస్తూనే ఉన్నదన్నారు. అమరులు బోళ్ల లక్ష్మ య్య, షేక్ మహమ్మద్ జాన్, బోయినపల్లి భిక్షాలు, బొడ్డుపల్లి అప్పన్న, బొడ్డుపల్లి వెంకయ్య, దొప్ప వెంకటేశ్వర్లు, దారగాని వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి నాగయ్య, ఆకెన వెంకటరాములు, పిల్లలమర్రి లక్ష్మీ నారాయణ, జక్కా నాగభూషణం తదితరులు సిపిఐ అభ్యున్నతి కోసం అహర్నిశం కృషి చేశారన్నారు. గ్రామంలో 2013, 2025లలో సిపిఐ మండల మహాసభ పెద్ద ఎత్తున్న జరపడానికి ముష్టికుంట్ల గ్రామం, ఆయా రాజకీయ పార్టీలు సిపిఐ గ్రామశాఖకు అండగా నిలిచిందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు పెద్ద ఎత్తున వామపక్ష కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళ సంఘాలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ ముగింపు సభకు జాతీయ, రాష్ట్ర నాయకులతో పాటు 20 దేశాల పైగా ప్రతినిధులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి సభ్యులు ఆకెన పవన్, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి ఎర్రుపాలెం మండల అధ్యక్షునిగా గూడూరు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ మండల అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వరెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని జమలాపురంలోని వాసిరెడ్డి కళ్యాణ మండపం నందు మండల తెలుగుదేశం పార్టీ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా ఉన్న సామేలు మంగళవారం అమెరికా వెళ్తున్న సందర్భంగా ఆయన స్థానంలో కొత్తగా పార్టీ సీనియర్ నాయకులు గూడూరు వెంకటేశ్వరరెడ్డిని తెలుగుదేశం పార్టీ కమిటి, అన్ని గ్రామశాఖ అధ్యక్షులు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గూడూరు వెంకటేశ్వరరెడ్డిని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి శికుమారి, జవ్వాజి భాస్కర్‌రావు, చాట్ల బాబురావు, కొర్లపాటి శ్రీనివాసరావు, వేముల వెంకటేశ్వరరావు, పి.రాజా, దేవరకొండ మోహన్‌రావు, కర్నాటి శ్రీనివాసరెడ్డి వీరమాచినేని వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దయాకర్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బాబాయ్ తుంబూరు ఉమామహేశ్వర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఖమ్మంరూరల్ కాంగ్రెస్ నేతలు సత్తుపల్లిలోని నారాయణపురం గ్రామంలో సోమవారం ఆయను కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మలారెడ్డి, అంబటి సుబ్బారావు, బండి జగదీష్, తోట వీరభద్రం, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్లు పంతుల్ నాయక్, ముత్యం చిన్న కృష్ణారావు తదితరులు ఉన్నారు.

# అడిషనల్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపిడీఓ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ ఎంపిడీఓగా నూతన బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ అడిషనల్ కలెక్టర్ శ్రీజను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే పాలేరు స్పెషల్ ఆఫీసర్ జ్యోతిని కలిసి వారిద్దరికి పుష్పగుచ్చాలను అందజేశారు.

# కుటుంబ కలహాలతో మహిళ హత్య

**-ఆమె కుమారుడికి తీవ్ర గాయాలు**
**- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ తిరుపతిరెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీలో సోమవారం దారుణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళను కత్తితో పొడిచి హతమార్చిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో మృతురాలి కుమారుడికి సైతం కత్తిపోట్లు దిగి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...ముత్తగూడేనికి చెందిన మొటపోతుల వెంకన్న కుమార్తె అఖిలను అదే గ్రామానికి చెందిన గునిగంటి మహేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. ఇటీవల భార్యభర్తల మధ్య మనస్పర్థాలు ఏర్పడటంతో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టుకున్నారు. అవే మనస్పర్థాలు కొనసాగుతుండగానే అఖిల తండ్రి మొటపోతుల వెంకన్న, కొడుకు మొటపోతుల మనోజ్, మహబూబాద్ జిల్లా డోర్నకల్ మండలం దేవునిసంకీసకు చెందిన అతని బావమరిది యల్ది వెంకన్నలతో పాటు కుమార్తెను తీసుకుని మహేష్ ఇంటికి వెళ్లారు. మా అమ్మాయిని భార్యగా అంగీకరించాలని అడగగా అతను ససేమిరా అనడంతో స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో వారంత తిరిగి వెళ్లి కుమార్తెను ఇంటి వద్ద ఉంచి, తండ్రి, కుమారుడు, బావమరిది కర్రలు, కల్లుగీసే కత్తులతో మహేష్ ఇంటిపై దాడి చేశారు. ఈ క్రమంలో మహేష్ కడుపులో, వెనుక నుంచి కత్తితో పొడిచారు. గమనంచిన తల్లి నాగమణి(48) అడ్డు రాగా.. ఆమెను పొట్టలో పొడవడంతో అక్కడిక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన మహేశ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకునక్న ఏసీపీ తిరుపతిరెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుమార్తె మధుష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ముష్క రాజు తెలిపారు.



# మద్యం మత్తులో కన్నతల్లిని కడతేర్చిన కసాయి కొడుకు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మద్యానికి బానిసైన కొడుకు కన్నతల్లిని కడతేర్చిన సంఘటన మండల పరిధిలోని కాకరవాయి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకరవాయి గ్రామానికి చెందిన మందుల బుబా(50)ను కన్న కొడుకు మధు మద్యం మత్తులో గొడ్డలి కర్రతో తలపై విచక్షణ రహితంగా కొట్టగా తీవ్ర గాయాలతో ఆమె అపస్మారకస్థితికి వెళ్లగా తన కొడుకు పట్టించుకోకుండా అదే స్థలంలో తల్లిని వదిలేసి ఇంట్లోకి వెళ్లి మద్యం మత్తులో నిద్రపోగా తెల్లవారు చూసేసరికి ఆమె మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై కూచిపూడి జగదీష్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మందుల బుబా కాయకష్టం చేసుకుని ఎదిగిన కొడుకుని సాకుతూ వస్తుంది. మధు భార్య సుమారు 20 సంవత్సరాల క్రితం అతనితో జీవించడం కష్టమని వదిలి వెళ్లి ఒంటిరిగా ఉంటుంది. ఇదే సమయంలో మద్యానికి బానిసైన మధు ఆదివారం అర్ధరాత్రి సొంత తల్లిని మద్యం సేవించడానికి తన ఫించన్ డబ్బులు ఇవ్వనందుకు ఘర్షణపడి గొడ్డలితో కొట్టినట్లు స్థానికులు తెలుపుతున్నారు.



# పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**-ప్రతి పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందించాలి**
**-విద్యాశాఖపై సమీక్షించిన అదనపు కలెక్టర్లు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు విద్యాశాఖపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉన్న విద్యా సంస్థలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని ఈనెల ఏడు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయలన్నారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసి పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. విద్యాశాఖ ప్రమాణాలలో ఖమ్మం జిల్లా బాగా రాణిస్తుందని, పోషణ లోపం వివరాల నమోదులో కొంత వెనకబడి ఉందని దీనిని కూడా అధిగమించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం మేరకు కిచెన్ షెడ్ నిర్మాణానికి సంబంధించి నవంబర్ ఏడు లోపు ప్రతిపాదనలు అందించాలన్నారు. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు, అపార్ నెంబర్ జనరేట్ చేయాలన్నారు. ఆర్‌బిఎస్‌కె ద్వారా పిల్లలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి పాఠశాలకు ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు అందించే భోజన నాణ్యతను పరిశీలించి ఈనెలాఖరు వరకు రిపోర్టు అందించాలన్నారు. పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరైనప్పటికీ 17 పనులు ఇంకా ఫీల్డ్ లెవల్‌లో ప్రారంభం కాకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిప్యూటీ సిఈవో నాగపద్మజ, జ్యోతిబా పూలే ఆర్‌సివో, బిసి సంక్షేమ శాఖాధికారిణి జి. జ్యోతి, మైనార్టీ సంక్షేమ అధికారి ముజాహిద్, డిటిడబ్ల్యూవో విజయలక్ష్మి , వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించండి




**ప్రజాపక్షం/ మధిర :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాలని డిప్యూటీ డిఎఅండ్ హెచ్‌ఓ డాక్టర్ చందు నాయక్ అన్నారు. సోమవారం మధిర పట్టణం, మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డ్‌లో మధిర నియోజకవర్గ స్థాయి వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, పల్లె దవఖానా సిబ్బంది, హెల్త్ ఆఫీసర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మాత శిశు ఆరోగ్య సంరక్షణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని అన్నారు. ప్రతి బిడ్డకు సంపూర్ణ సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు డోసులు వారీగా షెడ్యూల్ ప్రకారం టార్గెట్‌లు పూర్తి చేయాలని, అసంక్రమిక వ్యాధుల క్యాంపులు ఆన్‌లైన్ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. బస్తీ, పల్లె దవఖానా వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంత ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర టిబి యూనిట్ సిబ్బంది, వైద్యారోగ్య శాఖ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పంట నష్ట పరిహారం అందించండి

**-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ కోరారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తరుపున జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలు, తుఫాన్ ల వల్ల పెసర, పత్తి, వరి వంటి పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. పండిన కొద్ది పాటి పెసర పంటను కేంద్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పండిన కొద్ది పాటి పత్తిని కూడా రైతుల వద్ద నుంచి సిసిఐ కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం, పెట్టిన నిబంధనల వల్ల దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నకిలీ మొక్కజొన్న విత్తనాలను సరఫరా చేసే కంపెనీలు, ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పంటల బీమా పథకం ఏర్పాటు చేసి రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# నూతన ఎంపిడిఓ కార్యాలయాల నిర్మాణాలకు రూ.58కోట్లు మంజూరు

**ప్రజాపక్షం/ మధిర :** మధిర నియోజకవర్గంలోని మధిర, బోనకల్, ఎర్రుపాలెంలో మండల పరిషత్ నూతన భవన నిర్మాణాలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో రూ.58కోట్లు మంజూరయ్యారు. మధిర నియోజకవర్గం రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తయారు చేయాలని సంకల్పంతో ఇప్పటికే కోట్ల రూపాయలు వెచ్చించి మధిర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న భట్టివిక్రమార్క నూతనంగా మరో రూ.58 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగింది. మధిర మండల పరిషత్ కార్యాలయ నిర్మాణానికి రూ.21కోట్లు, ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయానికి రూ.18.75కోట్లు, బోనకల్ మండల పరిషత్ కార్యాలయానికి రూ.18.25 కోట్లు నిధులు మంజూరు చేశారు. త్వరలోనే నూతన భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. భట్టిక్రమార్క చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మధిర నియోజకవర్గ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

# ధాన్యం కొనగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు మెప్మా, డిసిఎంఎస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, తమ పంటలను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని సూచించారు. అదేవిధంగా తేమశాతం 17కు మించకుండా చూసుకోవాలని, పత్తి రైతులు కిపాస్ కిసాన్ యాప్ ద్వారా తమ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయి తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని, తద్వారా సిసిఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. సంబంధిత ఎంఇఓల వద్ద తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. పరిసర ప్రాంత రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి కె.చంద్రశేఖర్, వ్యవసాయశాఖ అధికారులు ఎస్.విజయ్‌చంద్ర, ఎఓ సాయిదీక్షిత్, తహశీల్దార్ ఆర్.రాంబాబు, మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, ఎఎంసి వైస్‌చైర్మన్ అయిలూరి సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, కిసాన్ సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వరరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, వేల్పుల చెంచయ్య, వేమిరెడ్డి అనురాధ, తుములూరి రాజా, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చూపించిన మాజీ సర్పంచ్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** వీఎం. బంజర నుంచి సత్తుపల్లి రోడ్ వెళ్లే మార్గంలో హెచ్‌పి పెట్రోల్ బంకు పక్కన ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడినవి. వాహనదారులకు తీవ్రమైన ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ద్విచక్ర వాహనం వారు చాలామంది కింద పడిపోయారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు ఈ సమస్యపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి విఎం బంజర మాజీ సర్పంచ్ భానోత్ కృష్ణ తన సొంత ఖర్చులతో రోడ్డుపైన ఏర్పడిన గుంటలను పూడ్చే పనిని ప్రారంభించారు. ప్రజల బాగు కోసం తన సొంత డబ్బులతో చేసిన ఈ ప్రయత్నాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా బానోత్ కృష్ణ మాజీ సర్పంచ్ చేసిన ఈ సేవను ఇతరులు కూడా ఆదర్శంగా తీసుకోవాలని స్థానికులు ఆశిస్తున్నారు. రహదారి మరమ్మతులకు సంబంధిత అధికారులు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని మనమందరం కోరుకుందాం.

# వైద్య వృత్తి మానవతా సేవకు ప్రతీక





**- విద్యార్థులు నిబద్ధతతో సేవ చేయాలి**
**- ప్రభుత్వ వైద్యకళాశాల్లో వైట్ కోట్ కార్యక్రమంలో కలెక్టర్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వైద్యవృత్తి మానవతా సేవకు ప్రతీక, విద్యార్థులు నిబద్ధతతో సమాజానికి సేవ చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల్లో నూతన వైద్య విద్యార్థులు (ఎంబిబిఎస్) వైద్య వృత్తిలో అడుగుపెట్టిన సందర్భంగా వైట్ కోట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి మానవతా సేవకు ప్రతీకని, ఇది కేవలం ఉద్యోగం కాదని, సమాజానికి అంకితమైన పవిత్ర బాధ్యత అన్నారు. వైద్య విద్యార్థులు రోగుల పట్ల కరుణ, సానుభూతి, అంకిత భావం కలిగి పనిచేయాలని సూచించారు. మీ చేతుల్లో సమాజ ఆరోగ్య భవిష్యత్ ఉంటుందని, ఉత్యున్నత వైద్య నైతిక ప్రమాణాలను పాటిస్తూప్రజల విశ్వాసాన్న నిలబెట్టుకోవడం ప్రతీ వైద్యుని ధర్మం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణలో యువవైద్యుల పాత్ర ఎంతో కీలకం అన్నారు. రాబోయే రోజుల్లో దేశ వైద్యరంగానికి మూల స్తంభాలు అని, దేశంలోనే క్రమశిక్షణ, సమయ పాలన, మానవతా దృక్పదం , ప్రజలపట్ల బాధ్యత వంటి విలువలను అందించాలని నూతన విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు వైద్య నైతిక ప్రమాణాల పట్ల నిబద్ధత వ్యక్తం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 150 మంది నూతన వైద్య విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా తెల్లకోట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. శ్రీహరి, కొత్తగూడెం ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రాధామోహన్, వైద్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

**- దర్బారులో ఐటిడిఏ పిఓ రాహుల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ హాజరైన ఆయన పలు గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి వనతులు స్వీకరించారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో బదలాయించారు. అర్హులైన గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. స్వయం ఉపాది ద్వారా జీవనోపాది పొందేందుకు మాత్రమే గిరిజన దర్బారులో దరఖాస్తులు చేసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరించబడవని పిఓ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వచ్చిన ప్రతీ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలని, అర్హులైన గిరిజనులకు విడుదల వారీగా



ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, ఇఇ మధుకర్, అర్‌సిఓ అరుణ కుమారి, ఏఓ సున్నం రాంబాబు, ఏపిఓ వేణు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

**వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు**

**ప్రజాపక్షం/వైరాః**


ఇందిరమ్మ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రైతు అభివృద్ధి ధ్యేయంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం జరిగింది. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలి. దళారులను నమ్మి మోసపోవద్దని, వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు అన్నారు. సోమవారం మార్కెట్ చైర్మన్ గంగారావు ప్రజాపక్షంతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షే మం కోసం నిరంతరం కృషి చేస్తుందని, రైతులు ఎక్కడ నష్టపోకుండా ఉండాలని పండించిన వరి ధాన్యాన్ని దళారులను నమ్మి మోసపోకుం డా ఉండేందుకు పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. కొంతమంది దళారులు మాయమాటలు చెప్పి ఎంతోమంది రైతులను మాయ చేసిన సందర్భాలు ఉన్నాయని, కొంతమంది రైతులు డబ్బులు రాక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, అలా నష్టపోకుండాఉండేందుకు ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని నమ్ముకోవాలని సూచించారు. పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవరు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు పెద్ద ఎత్తున ప్రారంభం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పనిచేస్తున్నారని ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల గురించి సమాచారం తీసుకుంటున్నారని, ఎక్కడ రైతు ఇబ్బంది పడవద్దని అధికారులు కూడా ఎమ్మెల్యే ఆదేశించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్ద పీత వేసిందని ఆయన గుర్తు చేశారు. రైతు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు సూచించారు.

# కాంగ్రెస్ అరాచకాలకు అడ్డూ అదుపు లేదు : సండ్ర

**ప్రజాపక్షం/చింతకాని :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుండి మదిర నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల అరాచకాలు పెరిగిపోయాయని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే బారాస నేత సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు.సోమవారం చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో గత మూడు రోజుల క్రితం హత్యగావించబడ్డ సీపీఎం నేత సామినేని రామారావు కుటుంబాన్ని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్బంగా రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సండ్ర మాట్లాడుతూ ఎవరి అండతో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు పెరిగి నియోజకవర్గంలో జరిగిన హత్యలపై భట్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామినేని రామారావు హత్యను పక్కదారి పట్టించేందుకు కుట్ర జరుగుతుందని అన్నారు. విచారణ పేరుతో రామారావు కుటుంబాన్ని పోలీసులు వేధించడం సరికాదన్నారు. మధిర నియోజకవర్గంలో ప్రతిపక్షం లేకుండా చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ హత్యా రాజకీయాలు చేస్తుందన్నారు.పోలీసులు అధికార పార్టీ ఒత్తిడికి లొంగకుండా నిష్పక్షపాతంగా



విచారణ చేసి రామారావుని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో తీవ్రపరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, రైతు సంఘం నాయకులు మాదినేని రమేష్ , బారాస మండల కార్యదర్శి వెంకటరామారవు, సీపీఎం మండల కార్యదర్శి రాచబంటి రాము తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు.మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కడియాల నగేష్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం



మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతుందని పేర్కోన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, రాయపూడి నవీన్, నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, మామిడి వెంకన్న, కడియాల నరేష్, గూడవల్లి రాంబ్రహ్మం, దండా పుల్లయ్య, రాధాకృష్ణ, లక్కల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీ ప్రైమరీ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఫ్రీ ప్రైమరీ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎంపీడీవో యం. యర్రయ్య సూచించారు. మండలం లోని రాజేశ్వరపురం లో సోమవారం పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులను



ప్రవేట్ పాఠశాలలకు పంపించకుండా ఫ్రీ ప్రైమరీ పాఠశాలలకు పంపించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని సూచించారు. చిన్నారుల ప్రాధమిక స్థాయి నుంచే విద్య పఠనం పెంచేలా స్కూల్స్ ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్య కు అధిక ప్రాధాన్యం కల్పిస్తూ అనేక మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పట్టు పురుగులు పెంపకంతో అధిక లాభాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పట్టుపురుగుల పెంపకం ద్వారా అధిక లాభాలు గడించవచ్చని ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖాధికారి కిషోర్ అన్నారు. సోమవారం లక్ష్మీ దేవిపల్లి మండలం హేమచంద్రాపురం సుస్మిత స్వయం ఉపాధిలో భాగంగా పట్టు పురుగులు పెంపకం చేపట్టారు. ఈసందర్భంగా కిషోర్‌తో పాటు సెరీకల్చర్ అధికారి నరేందర్ తో కలిసి ఆ కేంద్రాన్ని సందర్శించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేయడం ద్వారా ఏడాదిలోనే రూ.6 నుండి 8 లక్షల ఆదాయం పొందవచ్చన్నారు. బిఎస్‌సి చదువుతున్న సుస్మిత స్వయం ఉపాధి ద్వారా పట్టు పురుగులు పెంపకం చేపట్టి లాభాలు గడిస్తున్నారని, జిల్లాలో ఆసక్తిగల వారు పట్టు పరుగులు పెంపకం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు.

# కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

**ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రామ్ గోపాల్**

**ప్రజాపక్షం/మణుగూరుః**
సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలపై గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ మీటింగ్‌లో అంగీకరించిన సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె పోరాటానికి సిద్ధమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రామ్ గోపాల్




అన్నారు. సోమవారం మణుగూరు కేవిల్ మహేంద్ర భవన్ లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ 2023 ఏఐటియుసి గుర్తింపు కార్మిక సంఘం గా కార్మికులు ఎన్నుకున్న తర్వాత వివిధ స్థాయిల్లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశాలలో యూనియన్ పెట్టిన కొన్ని కార్మికుల సమస్యలు పరిష్కరించినప్పటికీ, వాటిని అమలుపరచడంలో యాజమాన్యం విఫలమైందని అన్నారు. ముఖ్యంగా యూనియన్ ప్రస్తావించిన కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి దానికి కమిటీ వేసి కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని ఆరోపించారు. సింగరేణిలో డిస్మిస్ అయిన ఉద్యోగులకు మళ్లీ ఒక అవకాశం కల్పించాలని అన్నారు. డిసిప్లినరీ చర్యలకోసం 150 మస్టర్లు చేయాలని యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా పెండింగ్ లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షను యాజమాన్యం తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం రీజియన్ లోని వికె7 జెకె 5 ఓ సి పీ లను పర్మినెంట్ కార్మికుల తోటే నడిపించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 6న అన్ని మైన్స్ డిపార్ట్మెంట్ల వద్ద, నవంబర్ 8న జిఎం కార్యాలయాల ముందు జరిగే ధర్నా నిరసన కార్యక్రమాలకు సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్ పిలుపునిచ్చారు. యాజమాన్యం స్పందించకుంటే సింగరేణిలో సమ్మె తప్పదని పైన పేర్కొన్న సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిచో జరిగే పరిణామాలకు యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించవలసి వస్తుందని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఎం.వి.రాం నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, శనిగరపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ఇసుక రవాణా..!

- కిన్నెరసాని పరివాహక ప్రాంతాలే లక్ష్యం
- కిలోమీటర్‌కు ఒకరు కాపలా
- నిఘా నీడలో తరలింపు - స్థాయిని బట్టి ముడుపులు..!
- పట్టించుకోని అధికారులు





**ప్రజాపక్షం/పాల్వంచ :** దొంగలు దొంగలు ఊర్లు పంచుకొన్న చందాన పలువురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి గత కొన్ని రోజులుగా కిన్నెరసాని వాగు ఇసుకను దోచుకుపోతున్నారు. ఒకరేమో రంగాపురం సమీపం నుండి, మరొకరేమో నాగారం రెవిన్యూ పరిధి నుండి, మరొకరేమో సీతారామ ప్రాజెక్టు కాలువ సమీపం నుండి ఇసుకను దొరికినంత దోపిడి చేస్తున్నారు. గత నెల 26వ, తేదీ రాత్రి సమయంలో పోలీస్ అధికారులు రంగాపురంలో రాత్రి వేళల్లో వాహన తనిఖీలు చేసున్నారు. పోలీస్ అధికారులంటే లెక్కలేకుండా, ఎంతమాత్రం భయం లేకుండా వారి కండ్లు గప్పి మరో చోటు నుండి ఇసుక తరలించుకుపోతున్నారంటే వారు ఎంతకు తెగబడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఉపేక్షిస్తే మరింత ప్రమాదకరంగా మారుతారని దీనికి ఎప్పటికప్పుడు నియంత్రించాలంటున్నారు. ఏ అధికారి సైతం వారిని అడ్డుకోలేరనే ధీమా ఒకవైపు, అధికారులకు వారి స్థాయిని బట్టి ముడుపులు చెల్లించామంటూ పలు ఆరోపణలు చేసుకొంటూ ధర్జాగా అక్రమానికి తెగబడుతున్నారు. పాల్వంచ పట్టణ కేంద్రంతో పాటుగా దానికి సమీపంలోని గ్రామీణ ప్రాంతాలైన, లక్ష్మీదేవిపల్లి, బసవతారక కాలని, పెద్దమ్మతల్లి దేవాలయం కేశవాపురం, జగన్నాథపురం తదితర ప్రాంతాలలో ఇంటి నిర్మాణాలతో పాటుగా కమర్షియల్ నిర్మాణాలు సాగుతున్నాయి. వీటికి తోడుగా ఇండ్లు లేని పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలు ఊపందుకొన్నాయి. కావలసిన ఇసుక ర్యాంపులు మండలంలో లేకపోవటం ఇసుకాసురులకు వరమైనది. అవకాశాలను అనుకూలంగా మార్చుకొన్నారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంతాలైన రంగాపురం, నాగారం, దంతెలబోర తదితర ప్రాంతాలే లక్ష్యంగా చేసుకొని అక్రమ ఇసుక రవాణాకు తెరలేపారు. రాత్రి 7 గంటల నుండి పది గంటల వరకు ట్రాక్టర్లతో తమకు అనుకూలమైన ప్రాంతాలలో ఇసుకను డంప్ చేస్తారు. అనంతరం జేసిబి లాంటి యంత్రాలతో టిప్పర్‌లకు ఎత్తి పాల్వంచ, పాల్వంచ మీదుగా కొత్తగూడెం, ఖమ్మం తదితర పట్టణాలకు రవాణా చేస్తున్నారు. దొంగలు, దొంగలు ఊర్లు పంచుకొన్న చందాన బూర్గంపాడు, మోరంపల్లి బంజెర, పాల్వంచ, రంగాపురం గ్రామాలకు చెందిన కొందరు టిప్పర్ యాజమానులు ఇసుక రవాణా చేయటానికి సిండికేట్‌గా ఏర్పడ్డారు. విలువైన ఇసుకపై కన్నేశారు. తమ ఆర్థిక, రాజకీయ పలుకుబడితో అధికారులను మచ్చిక చేసుకొని నిఘా నీడలో ఇసుక రవాణాకు పాల్పడుతూ లక్షల సొమ్మును అందిన కాడికి దోచుకొంటున్నారు. రంగాపురం సమీపంలోని ఓ మామిడి తోటను అడ్డాగా చేసుకొన్న అక్రమార్కులు అక్కడి నుండి ప్రతీ రోజు పదుల సంఖ్యలో టిప్పర్లతో వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ సొమ్మున యదేశ్చగా దోచుకుపోతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి వారి మనుషులతో పాల్వంచ నుండి మొదలుకొని కిలో మీటర్‌కు ఒకరు చొప్పున ఉంటూ అధికారుల రాకను పసిగడుతూ నిత్యం నిఘా నీడలో తరలించుకుపోతున్నారు.

# శీతాకాలం హైబిపి పేషెంట్లు అప్రమత్తంగా ఉండాలి

-బత్తినేని ట్రస్ట్ సౌజన్యంతో
62 బిపీ, షుగర్ క్యాంపు విజయవంతం
-ట్రస్ట్ సేవలు అభినందనీయం
-ప్రముఖ వైద్యులు టి పవన్‌కుమార్, కిరణ్‌కుమార్ గుదిగొండ







**ప్రజాపక్షం/బోనకల్:** శీతాకాలంలో హైబిపీ పేషంట్లు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ బిపి, షుగర్, జనరల్ వైద్య నిపుణులు టి పవన్‌కుమార్, దుర్గ విరించి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత, ప్రముఖ కార్డియాలజిస్ట్ కిరణ్‌కుమార్ గుదిగొండ లు తెలిపారు. మండల కేంద్రంలో ప్రతినెల మొదటి ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం నిర్వహించే బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపు అదివారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు టి పవన్‌కుమార్, కిరణ్‌కుమార్ గుదిగొండ లు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో హై బిపీ అనేది చాలా మందికి వస్తోందని, ఒకప్పుడు కేవలం వయస్సు మీద పడిన వాళ్లకే వచ్చేదని అన్నారు. కానీ ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్నవారు కూడా హైబిపీ బారిన పడుతున్నారని అన్నారు. ఇందుకు ఒత్తిడే ప్రధాన కారణమని తెలుస్తోందని, దీని వల్ల చాలా మందికి గుండె జబ్బులతో పాటు హార్ట్ ఎటాక్‌లు వస్తున్నాయన్నారు. దీంతో యుక్త వయస్సులోనే ప్రాణాలు కోల్పోతున్నారని, కనున ఎవరికైనా హైబిపి ఉంటే అసలు నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. పలు అధ్యయనాల ప్రకారం చలికాలంలో హార్ట్ ఎటాక్ వస్తాయని తేలిందని, ఈ సీజన్ రక్త ప్రసరణ సరిగ్గా ఉండదని, దీంతో బిపి పెరుగుతుందని పేర్కొన్నారు. కాబట్టి చలికాలంలో ప్రతి ఒక్కరూ తమ గుండె ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాల్సి ఉంటుందని అన్నారు. చలికాలంలో శరీరానికి తగినత రక్త సరఫరా చేసేందుకు, వెచ్చదనంగా ఉచ్చేందుకు గుండెకు పనిపెరుగుతుందని తెలిపారు. దీంతో కండరాలకు ఆక్సిజన్, పోషకాల సరఫరా తగ్గుతుందని, దీని వల్ల బ్లడ్ ప్రెజర్ అధికమవ్వడం, రక్తగడ్డ కట్టే ప్రమాదం పెరుగుతుందని తెలిపారు. ఛాతినొప్పి, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, ఎగువశరీర ప్రాంతాల్లో నొప్పి, వికారం, వాంతులు, కళ్లు తిరగడం, చల్లని చెమట వంటి లక్షణాలు కన్పిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. బిపి, షుగర్ పేషంట్లతో పాటు అధికంగా మాంసం తినేవారు, అధికంగా మద్యం త్రాగేవారు యేడాది ఒక్కసారైనా కనీసం ఈసీజీ, టుడి ఈఓ, టిఎంటీ, లిపిడ్ ప్రోఫైల్, హెచ్‌బిఎ1సి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఐదేళ్లుగా నిర్విరామంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపును రూపొందించి వైద్యసేవలు అందిస్తున్న బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. క్యాంపులో వైద్యులు 100 మంది పేషంట్లకు బిపి, షుగర్, క్రియాటిన్, హిమోగ్లోబిన్, టుడిఈఓ, ఈసిజీలు పరీక్షలు నిర్వహించి వైద్య పరీక్షలు అందించగా, మందులను ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్‌ఎంపిడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఏలూరి పూర్ణచంద్రరావు, మాతంగి శ్రీనివాసరావు, ఆకెన పవన్, సిపిఎం నాయకులు షేక్ నజీరు, క్యాంపు సహాయకులు యంగల గిరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్

-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజగోపాల్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నవంబర్ 15న ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు రాజీ చేసుకోవాలనుకునే వారు దీనిని సద్వినియోగం చేసుకుని కోర్టు కేసుల నుంచి ఉపశమనం పొందాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు. ఖమ్మం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణపై సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. రాజగోపాల్ పోలీస్, బ్యాంకర్లు, చిట్‌ఫండ్ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజగోపాల్ మాట్లాడుతూ లీగల్ సర్వీస్ అథారిటీ తరుపున ప్రతి మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజీ చేసుకోవాలనుకునే క్రిమినల్, ఇతర కేసులకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందన్నారు. యాక్సిడెంట్స్, భార్యభర్తల వివాదాలు, చెక్‌బౌన్స్ వంటి వివిధ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చునన్నారు. ప్రమాద కేసులు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటే ఒకేసారి పరిహారం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకున్న కేసుల్లో మళ్లి ఉన్నత కోర్టులకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. లోక్ అదాలత్ పట్ల గ్రామీణ ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ 15న జిల్లాలోని అన్ని కోర్టులలో ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలు వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఉమ, న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వరరావు, నామినేటెడ్ సభ్యులు, న్యాయవాదులు శ్రీనివాసరావు, సంధ్యారాణి, పోలీస్, ఎక్సైజ్, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు, చిట్‌ఫండ్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నిషేదిత గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక జిఆర్‌పి సిఐ ఎన్ అంజలి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. సూపరిండెంట్ అఫ్ రైల్వే పోలీసు సికింద్రబాద్, డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు కాజిపేట వారి ఆదేశాల మేరకు ఖమ్మం జిఆర్‌పి సిఐ అంజలి, డోర్నకల్లు ఎస్సై జె. సురేష్, రైల్వే ప్రోటక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి ఖమ్మం రైల్వేస్టేషన్ రెండవ నెంబర్ ప్లాటుఫాం మీద బుధవారం తనిఖీలు చేస్తుండగా పుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద బ్యాగులు ధరించి అనుమానాస్పందంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను నిలవరించి తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైందని తెలిపారు. స్టేషన్‌కు తరలించి విచారించగా ఒరిస్సాకు చెందిన సోమానత్‌నాగా, సునిల్‌కునారాలు తమ రాష్ట్రంలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి సోలాపుర్‌లో ఎక్కువ ధరకు దానిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఒరిస్సాలో పది కేజీల గంజాయిని కొనుగోలు చేసి ఐదు ప్యాకెట్లలో భద్రపరిచి భువనేశ్వర్‌లో ఆదివారం సోలాపుర్ వెళ్లేందుకు కొణార్క్ ఎస్‌ప్రెస్ ఎక్కినట్లు తెలిపారు. టికెట్టు లేకుండా ప్రయాణిస్తుండటంతో తనిఖీకి వచ్చిని టిసి వారిని ఖమ్మంలో దింపివేయడంతో వారు మరో రైలు ఎక్కేందుకు ఖమ్మం రెండవ నెంబర్ ప్లాట్‌ఫాం పై వేచిచూస్తుండగా సోమవారం ఉదయం తనిఖీలు చేస్తున్న స్థానిక జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ సిబ్బందికి వారు పట్టుబడినట్లు అంజలి వివరించారు. వీరి నుంచి 5,15,000/ రూపాయల విలువ చేసే 10.18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కాజిపేట రైల్వేకోర్టుకు తరలించినట్లు తెలిపారు.

# నెత్తురు పారిన గ్రామాల్లో నీళ్లు పారించాం

-హత్యా రాజకీయాలు చేసేది సీపీఎం
-భట్టీపై ఆరోపణలు సీపీఎం విజ్ఞతకే వదిలేస్తున్నాం
-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



**ప్రజాపక్షం/చింతకాని :** ఏళ్ల తరబడి రాజకీయ కక్షలతో నెత్తురు పారిన మధిర నియోజకవర్గంలో నేడు నీళ్ళు పారించిన ఘనత మల్లు భట్టి విక్రమార్కదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హత్యారాజకీయాలతో మధిర నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటే భట్టి నేడు అభివృద్ధికి చిరునామాగా చూపిస్తుంటే ఓర్వలేని సీపీఎం నేతలు భట్టి విక్రమార్కపై నిందలువేయడం సిగ్గుచేటన్నారు. హత్యారాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ దూరమని హత్యా రాజకీయాలు చేసేది ఎవరో మొన్నట అసెంబ్లీ ఎన్నికల్లో గోవిందాపురం ప్రజలే తీర్పు చెప్పారన్నారు. హత్యా రాజకీయాలు చేసేది ఎవరో గోకినేపల్లి , తెల్దారుపల్లి ఘటనలే నిదర్శనమాన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమానికి ఆకర్షితులే ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతుంటే జీర్ణింప్చకోలేని పోతినేని, నున్నా కాంగ్రెస్ పై నిందలు వేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.రాజకీయ ఉనికి కోస ఇతర పార్టీలపై నిందలు వేయడం సరికాదన్నారు. రామారావు హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పుచ్చకాయల వీరభద్రం, ఆత్మ కమిటీ డైరక్టర్లు కొప్పుల గోవిందరావు, సట్టు వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరక్టర్లు, బందెల నాగార్జున, షేక్ ఖాసీం, మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, కన్నెబోయిన గోపి, ఓర్సు వీరభద్రం , కోపూరి పూర్ణయ్య, మైనార్టీ సెల్ నాయకులు పాషా, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు